# మానవ వికాస వేదిక

# తెలంగాణా రాష్ట్ర రెండవ మహాసభలు

**వేదిక: ఎం.ఎస్.కళాశాల (ఆర్.టి.సి. బస్టాండ్ దగ్గర) కోదాడ, సూర్యాపేట జిల్లా**

**సమయం: 2017, సెప్టెంబర్ 9, 10 తేదీలు**

## ఆహ్వానం

మిత్రులారా !

మానవ వికాస వేదిక 2వ రాష్ట్రమహాసభలకు సూర్యాపేట జిల్లాలోని కోదాడ పట్టణం వేదిక కాబోతున్నందుకు చాలా సంతోషిస్తున్నాం. ఉత్సాహపూరిత వాతావరణంలో చైతన్యస్ఫోరకంగా ఘనంగా జరగబోతున్న ఈ మహాసభలకు విచ్చేసి, జయప్రదం చేయవలసినదిగా మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

మానవ వికాస వేదిక గురించి ఇపుడు కొత్తగా పరిచయం అవసరం లేదు. ఎందుకంటే, 2004 సెప్టెంబర్ 12న, హైదరాబాద్‌లో ఏర్పడినప్పటి నుంచి, ఈ పదమూడేళ్ళలో అనేక కార్యక్రమాల ద్వారా జనావళికి సుపరిచితమైంది. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా జనాన్ని చైతన్యపరచింది. బాణామతి పేర అమాయకులను మంత్రగాళ్ళుగా ముద్రవేసి హింసాదౌర్జన్యాలు అమలు చేస్తుంటే అడ్డుకొని, కనువిప్పు కలిగించింది. వాస్తు, జ్యోతిష్యం, రంగురాళ్ళు, తాయెత్తులు, మంత్రాలు, శుభయంత్రాలు మొదలైన వాటిపేరుతో జరిగే మోసాలను తెలియజెపుతూ వాటి అశాస్త్రీయతను ఎండగట్టింది. విద్యార్థుల్లో సైన్సు దృక్పథాన్ని పెంచటం కోసం తెలంగాణా వ్యాప్తంగా గణిత, భౌతికశాస్త్రాలలో ప్రతిభా పరీక్షలను నిర్వహించి, వారి తెలివితేటల్ని సమాజం ముందుంచి, "బాలలు సమాజానికి మేధోసంపద" అని చాటి చెప్పింది. మానవీయ విలువలపై సెమినార్లు పెట్టి, ప్రజాస్వామిక కుటుంబాల ఆవశ్యకతను తెలియజేసింది. ఆధునిక సమాజనిర్మాణానికి అవరోధంగా వున్న కులతత్వాన్ని నిర్మూలించే పనిలో భాగంగా, అనేక కులవ్యతిరేక వివాహాలను ప్రోత్సహించింది. ఇలా, మానవ వికాస వేదిక నేటి సమాజానికి ఒక భావవిప్లవ దీపికలా పనిచేస్తోంది.

'భావవిప్లవం' అంటే, మన ఆలోచనల్లో సానుకూల మౌలిక మార్పులు రావటం. వైజ్ఞానిక, సాంకేతిక రంగాల పరిశోధనా ఫలితాల వల్ల, రోజురోజుకీ, సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నాయి. సమాచార విప్లవం సాధించినప్రగతి ప్రపంచాన్ని మన అరచేతిలో పెట్టింది. ఈ పరిణామాలవల్ల, మనం సాంఘికంగా, సాంస్కృతికంగా ఎంతో అభివృద్ధి పొందగలగాలి. కాని అలా జరగడం లేదు. మన ఆలోచనా పరిధి విస్తరించటంలేదు. మనలో వైజ్ఞానికస్పృహ పెరగకపోగా, పాతకాలపు మూఢత్వమే కొత్తరూపుతో మనల్ని ఆకర్షించి వెనక్కి లాగుతోంది. ఈ కాలానికి విలువలేనివిగా రుజువైన పాత మతాచారాలు కొత్తమేకప్‌తో మన ఇళ్లలోకి చొరబడుతున్నాయి. నోములు, వ్రతాలు, అర్చనలు, కొలుపులు వంటివి మీడియా ప్రచారాల వల్ల పెచ్చుమీరి మహిళాలోకాన్ని మళ్ళీ భావదాస్యం లోకి నెడుతున్నాయి. బాల్యవివాహాలు పెరుగుతున్నాయి. తెలంగాణలో కనీవిని ఎరుగని 'పరువు హత్యలు' మనిషిలోని మృగత్వాన్ని తట్టిలేపుతున్నాయి. కులతత్వాన్ని సజీవంగా ఉంచుతున్న స్వార్థ రాజకీయాలు, దాన్ని పెంచుతున్న హైటెక్ ప్రచార పద్ధతులు సాంఘిక సమైక్యతను ప్రమాదంలోకి తోస్తున్నాయి. విశాలదృష్టితో అమలు కావాల్సిన మానవహక్కులు, కులహక్కులుగా కుంచించుకుపోతున్నాయి. ప్రజాస్వామిక సంస్కృతి వ్యాపించాల్సిన తరుణంలో అగ్రకులీన ఆధిపత్య భావజాలపు 'ప్రవచనాలు' తియ్యగా మెదళ్ళలో దూరి, ఛాందసత్వాన్ని నింపుతున్నాయి. పశువుల్ని పూజించటం కోసం మనుషుల్ని నరికినా తప్పులేదన్న అమానుషతత్త్వం ఇపుడు చట్టబద్ధమవుతోంది. గతించిపోయాయనుకున్న ఇలాంటి